క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరం



సర్దార్‌నగర్‌లో పశువులకు లంపీస్కిన్ వ్యాధి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చందనవెల్లి, సర్దార్‌నగర్, ఆస్పల్లిగూడ గ్రామాల్లో నిర్వహించిన శిబిరాల్లో పశువులకు లంపీస్కిన్, గొంతువాపు, తొడవాపు వ్యాధుల నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి

జన శిక్షణ సంస్థాన్ జిల్లా డైరెక్టర్ రామ్మోహన్



మాట్లాడుతున్న రామ్మోహన్

కొత్తూరు: మహిళలు తమకు ఆసక్తి ఉన్న ఉపాధి రంగాల్లో రాణించాలని జన శిక్షణ సంస్థాన్ జిల్లా డైరెక్టర్ రామ్మోహన్ సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు ప్రభుత్వ సహకారంతో స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలన్నారు. శిక్షణ అనంతరం మహిళలకు వ్యాపారం, మార్కెట్ అవకాశాలతో పాటు సర్టిఫికెట్లను అందించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు స్వప్న, ఆనంద్‌కుమార్, గీత పాల్గొన్నారు.

టై, బెల్టుల అందజేత

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిన్నచిల్కమర్రి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు పల్లె నర్సింహారెడ్డి, యాదయ్య టై, బెల్టులను అందజేశారు. అనంతరం దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జగదీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సమితి కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీరామలింగేశ్వర సహకార సంఘాల సమితి లిమిటెడ్ కార్యాలయంలో గురువారం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిళ్ల కుమార్ అధ్యక్షతన సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 2025–26 సంవత్సరానికిగాను సమితి పాలకవర్గ ఎన్నికలను నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎలుకుర్తి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 50 గ్రామాలలో విస్తరించిన ఉన్న ఈ పొదుపు సంఘంలో 12వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. పొదుపు సంఘాల సభ్యులకు పొదుపులు, అప్పులు, భీమా సౌకర్యాన్ని కల్పించడంతో పాటుగా ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని మహిళల ఆర్థిక సాధికారతకు వేదికలుగా నిలుస్తాయన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమితి సీఈఓ పతంగి సంపత్‌కుమార్, సభ్యులు ఇస్నాతి మహేందర్, పూజారి మల్లేష్, ర్యాకల మల్లేశ్, కటిక కృష్ణాజీ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బీఆర్‌ఎస్వీ నాయకుడు పృథ్వీరాజ్

చేవెళ్ల: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్‌ఎస్వీ నాయకులు పృథ్వీరాజ్, రవికుమార్, ఆసిఫ్, భాస్కర్ అన్నారు. మండలంలోని ధర్మసాగర్ సమీపంలో ఉన్న బీసీ గురుకుల పాఠశాలను గురువారం బీఆర్‌ఎస్వీ నాయకులు బడిబాట కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలోని తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యతలేని ఆహారం అందిస్తున్నట్లు వారు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, ఎండీ అమాన్, సైఫ్ అలీఖాన్, అనిల్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖ అధికారులతో ప్రభుత్వం అందిస్తున్న పథకాల పనితీరుపై చర్చించారు. వ్యవసాయాధికారులతో మాట్లాడుతూ.. రుణమాఫీ ఎంత మంది రైతులకు జరిగిందని, కానీ రైతులు ఎంత మంది ఉన్నారని అడిగారు. రైతు భరోసా పథకం నిధులు రైతులందరి ఖాతాలకు చేరాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా రాకపోతే వారి వివరాలు సేకరించి వారికి వచ్చేలా చూడాలన్నారు. రైతులకు సంబంధించిన పంట నమోదు వివరాలను కూడా తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఉచితంగా పంపిణీ చేస్తున్న విత్తనాలు రైతులకు చేరాలన్నారు. గ్రామాల్లో నిన్నటి వరకు జరిగిన భూ భారతి సదస్సుల్లో తీసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు నాయకులతో కలిసిమెలసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డివిజన్ అధికారి సురేశ్‌బాబు, తహసీల్దార్లు కృష్ణయ్య, బుచ్చయ్య, వెంకటయ్య, ఎంపీడీఓలు, ఏఓ, ఏఈఓలు, ఐదు మండలాల వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్



వ్యాపారులకు ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఖాజామొయిజుద్దీన్, సిబ్బంది

మొయినాబాద్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద వందరోజుల ప్రణాళికలో భాగంగా ప్రపంచ ప్లాస్టిక్ నిషేధ దినోత్సవం సందర్భంగా చిరువ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉన్న చిరు వ్యాపారులకు ఆయన ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ వారికి క్లాత్ బ్యాగ్స్ అందజేశారు. అందరం కలిసి ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చుకుందామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనార్థాలను గుర్తించాలన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలకు ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తామన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జమీర్, సిబ్బంది, స్థానికులు తదితరులు ఉన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ

చేవెళ్ల: రైతులు పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండల కేంద్రంలో గురువారం జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద రైతులకు ఉచితంగా కంది విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆహార పంటల ఉత్పత్తులను సాగుచేసి అధిక లాభాలను పొందాలని సూచించారు. రైతులకు కంది విత్తనాల (ఎల్‌ఆర్‌జీ–105, ఎల్‌ఆర్‌జీ–52) మినీ కిట్స్ విత్తనాల ప్యాకెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు జాబితాపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

కొత్తూరు: ఓటరు జాబితాలో పలు మార్పులు, ఇతర అంశాలపై బీఎల్‌ఓలకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని షాద్‌నగర్ ఆర్డీఓ సరిత పరిశీలించి వారికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఓటరు నమోదు, జాబితాలో తప్పుల సవరణలు, ఒక వార్డు నుంచి మరో వార్డు లేదా ఇతర ప్రాంతానికి ఓటు మార్చుకోవడంతో పాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంతేగాకుండా కొన్ని చోట్ల చనిపోయిన వారి పేర్లు కూడా జాబితాలో ఉండడం, మరి కొన్ని చోట్ల ఒక ఓటరుకు రెండు చోట్ల జాబితాలో పేర్లు ఉండడాన్ని గుర్తించి సరిచేయాలని సూచించారు. తమ పరిధిలోకి వచ్చే ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు, జంగయ్య, బాలవర్ధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం



స్కూల్ కౌన్సిల్ ఎన్నికల విజేతలతో ప్రిన్సిపాల్ విద్యుల్లత

ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని కమ్మదనం గురుకుల ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల కమిషన్ సభ్యులుగా ప్రిన్సిపాల్ విద్యుల్లత, చంద్రకళ, శిరీష, ప్రవళిక, రిటర్నింగ్ అధికారిణిగా సుసన్న, రూట్ అధికారులుగా స్వప్న, రమ్య భార్గవి, నాగమణి వ్యవహరించారు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, కల్చరర్ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లిటరసీ సెక్రటరీని ఎన్నుకునేందుకు నిర్వహించిన ఎన్నికలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లలో 97శాతం మంది విద్యార్థినులు పాల్గొని ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం విద్యుల్లత మాట్లాడుతూ.. పాఠశాల కౌన్సిల్ ఎన్నికలు విద్యార్థుల జీవితాలలో ఒక ముఖ్యమైన భాగమన్నారు. పాఠశాల కార్యక్రమాలు, సేవా ప్రాజెక్టులను నిర్వహించడం ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి స్టూడెంట్ కౌన్సిల్ నియామకం ఒక వేదికగా నిలుస్తుందన్నారు. స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయ, అధ్యాపక బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

ఎంపీడీఓ సంధ్య



బయోమెట్రిక్‌ను ప్రారంభిస్తున్న సంధ్య

మొయినాబాద్‌రూరల్: అధికారులు, ఉద్యోగులందరూ ప్రతిరోజు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను వాడాలని ఎంపీడీఓ సంధ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బయోమెట్రిక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె బయోమెట్రిక్ వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొత్తం 15 మంది అధికారులు, సిబ్బంది ఉన్నారని, అందరూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సూపరింటెండెంట్ రహమాన్, అధికారులు కులశేఖర్, సిబ్బంది పాండు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయండి

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్



మాట్లాడుతున్న భీంభరత్

షాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న సమ్మేళన సభను విజయవంతం చేయాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే గ్రామస్థాయి, డివిజన్ అధ్యక్షుల సమ్మేళన సభను విజయవంతం చేయాలని కోరారు. జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న నిర్వహించనున్న గ్రామ పార్టీ అధ్యక్షుల సమ్మేళనానికి మల్లికార్జున ఖర్గే హాజరుకానున్నారన్నారు. రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభను నిర్వహిస్తున్నారని తెలిపారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి, ఎలా ముందుకు తీసుకెళ్లాలని, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేయనున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు గౌరి సతీష్, ఎస్.రాంరెడ్డి, చల్లా మాధవరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు పామెన నర్సింలు, మంగలి చెన్నయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోతుగల్ గ్రామానికి చెందిన అజీమ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి భీంభరత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

గ్రామగ్రామాన జెండాలు ఎగురవేద్దాం

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌మాదిగ



జెండా దిమ్మె నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ గ్రామాన జెండా కార్యక్రమం నిర్వహిద్దామని మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్‌మాదిగ, ఉపాధ్యక్షుడు దరుగుపల్లి రాజుమాదిగ అన్నారు. గురువారం మండల పరిధిలోని అమ్డాపూర్‌లో సమావేశం నిర్వహించి.. జెండా దిమ్మె నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి కిరణ్, శ్రీను, జంగయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

మొయినాబాద్: మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేశ్ ఆరోపించారు. గురువారం నాయకులు రాజేశ్, శ్రీకాంత్ పాఠశాలను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఓ పక్క అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తుండగా.. మరో పక్క ఫిట్‌నెస్ లేని బస్సులతో రోజుకో ప్రమాదం జరుగుతుందన్నారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లలో తరగతులు నిర్వహిస్తూ రెండో ఫ్లోర్ నిర్మాణ పనులు చేపడుతున్నారని.. ఇటుకలు, సెంట్రింగ్ డబ్బాలు, కట్టెలు, ఇనుప రాడ్లు ఏవైనా జారి కింద పడితే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ పాఠశాలపై జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి పాఠశాల యాజమాన్యంపై, విద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘ఇందిరమ్మ’ బిల్లులపై అపోహలు వద్దు

ఎంపీడీఓ బన్సీలాల్



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల బిల్లులపై అపోహలు వద్దని, డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ అవుతాయని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసిన లబ్ధిదారుడు రాజిరెడ్డి దంపతులకు ఆయన రూ.1లక్ష చెక్కును అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రామంలో 31 ఇళ్లకు సంబంధించి నిర్మాణ పనులను ప్రారంభించారని, అందులో 6 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయన్నారు. ఇళ్ల నిర్మాణం బిల్లులు వస్తాయా, రావా అనే అనుమానాలు వద్దని, ఇల్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం బిల్లులు అందజేస్తుందని స్పష్టం చేశారు. బిల్లుల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఎవరికీ డబ్బులు ఇవ్వకూడదని సూచించారు. నిర్మాణాలను తొందరగా పూర్తిచేసి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ నర్సింలు, మాజీ ఉపసర్పంచ్ చిన్నయ్య, నాయకులు మల్లారెడ్డి, బుచ్చి లింగంగౌడ్, రాజ్‌కుమార్, ప్రకాశ్‌గౌడ్, యాదయ్య, పెంటయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సి.శ్రీశైలం, బి.శ్రీశైలం, హరిశంకర్, రాధిక, నీలమ్మ, కారోబార్ కృష్ణయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



షాద్‌నగర్: రాంచందర్‌రావును సత్కరిస్తున్న నాయకులు



చేవెళ్ల: రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును గురువారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, నర్సింహాయాదవ్, సుధాకర్, బల్వంత్‌రెడ్డి, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, రంగన్నగౌడ్, నరేందర్‌రెడ్డి, బోయ అశోక్, మహేశ్, అనిల్‌కుమార్‌గౌడ్, సుధీర్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

చేవెళ్ల: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును పార్టీ చేవెళ్ల నియోజకవర్గ నాయకులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, జిల్లా నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ మల్గారి విజయ్‌భాస్కర్‌రెడ్డి, నాగరాజు, ఆయా మండలాలకు చెందిన నాయకులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా చేవెళ్లకు చెందిన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మండల నాయకులు

కేశంపేట: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎంపికైన రాంచందర్‌రావును జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేశ్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, సాంస్కృతిక శాఖ జిల్లా కోకన్వీనర్ నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భక్తవత్సల్, సోడం శ్రీనివాస్ ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

మొయినాబాద్: నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. గురువారం మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక కార్మికులు, రైతులపై దాడులు పెరిగాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను పెట్టుబడిదారి వర్గాలకు కొమ్ముకాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పజెప్తున్నారని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని 12 గంటలుగా మారుస్తున్నారన్నారు. కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి అన్ని కార్మిక సంఘాలు ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని.. కార్మికులంతా సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మక్బూల్, సీపీఐ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, పాండు, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న బాబర్‌ఖాన్

షాద్‌నగర్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇందులో భాగంగా రూ.39.72కోట్లతో వార్డుల వారీగా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, బీటీరోడ్ల పనులతో పాటు విద్యుద్దీకరణలో భాగంగా పాత స్తంభాల తొలగింపు కొత్తవి ఏర్పాటు, లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీ నుంచి వార్డుల వారీగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు రఘునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, ఇబ్రహీం, ముబారక్, విజయ్‌కుమార్, శ్రీను, జాంగారి రవి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘అసత్య ఆరోపణలు సరికాదు’



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

షాద్‌నగర్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నేతలు మన్నె నారాయణ, లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఓ యువ నాయకుడి ఫోన్ ట్యాపింగ్ ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయ ఉనికి కోసం ఇతరులపై నిందలు మోపితే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. కాలయాపన చేస్తున్నారన్నారని విమర్శించారు. అవినీతి, తప్పుడు కార్యక్రమాలు చేస్తే చర్యలు తీసుకునేందుకు చట్టాలు, ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కాంగ్రెస్ నేతల వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే ప్రభుత్వానికి అందజేయాలని సవాల్ విసిరారు. ఆధారాలు ఉంటే 48 గంటల్లో రుజువు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శేఖర్, జూపల్లి శంకర్, గుండు అశోక్, సందీప్‌సింగ్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్, శ్రీనివాస్, సంజునాయక్ పాల్గొన్నారు.